# మారుతున్న బడి

'నాడు–నేడు' మొదటి విడతలో పాఠశాలల రూపురేఖలు మార్చి అవురా..! అనిపించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. బడిని ఇలా కూడా చేయొచ్చా అని తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. సెలవులు ముగించుకొని పాఠశాలకు వచ్చిన పిల్లలు మార్పును చూసి ఇది మా బడేనా అంటూ అనుమానం వ్యక్తం చేసేంతలా రూపుదిద్దారు. నాడు కొన్ని పాఠశాలల్లోనే పనులు చేపట్టగా.. ప్రస్తుతం రెండో విడతలో మరిన్ని విద్యాలయాలను తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పనులు జోరుగా సాగుతున్నాయి.



మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 20 గదుల కోసం నిర్మాణం చేపట్టిన దృశ్యం

- 'నాడు–నేడు' రెండో విడతలో నియోజక వర్గంలో 109 విద్యాలయాల ఎంపిక
- 108 పాఠశాలలు, ఒక కళాశాలలో జోరుగా పనులు
- రూ.33 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

ఆదోని అర్బన్ : పేద విద్యార్థులు కార్పొరేట్ స్థాయి విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన వెంటనే విద్యావ్యవస్థ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో వసతుల కల్పనకు నాడు–నేడు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదోని నియోజకవర్గంలో మొదటి విడతలో 67 పాఠశాలలను ఎంచుకొని రూ.22 కోట్లు మంజూరు చేశారు. దీంతో మరమ్మతులకు నోచుకోని పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. దీంతో విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నుంచి వచ్చి సర్కారు బడుల్లో చేరడంతో ఆయా పాఠశాలలు విద్యార్థులతో కిక్కిరిసిపోయాయి. బడిలో వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు, బూట్లు, టై, జగనన్న గోరుముద్ద, 8వ తరగతి విద్యార్థులకు ల్యాప్‌టాప్ అందజేశారు. మిగిలిన పాఠశాలల్లో కూడా వసతులు కల్పించాలని రెండో విడత కార్యక్రమాన్ని షురూ చేశారు. ఇందుకు నియోజకవర్గంలో 108 పాఠశాలలు, ఒక కళాశాలను ఎంపిక చేశారు. పనులు చేపట్టేందుకు రూ.33కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో ఆయా పాఠశాలల్లో అదనపు గదులు, ప్రహరీ, ఎలక్ట్రికల్ పనులు, తాగునీరు, బాత్‌రూములు, మరుగుదొడ్లు, మరమ్మతులు చేపట్టనున్నారు. ఎంపికైన పాఠశాలల్లో.. ప్రాథమిక పాఠశాలలు 17, ప్రాథమికోన్నత పాఠశాలలు 66, ఉన్నత పాఠశాలలు 17, అంగన్‌వాడీలు 8, ప్రభుత్వ కళాశాల 1 ఉన్నాయి. ఆయా విద్యాలయాల్లో ప్రస్తుతం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నాటికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.





ఆర్‌ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 20 అదనపు గదుల నిర్మాణం జరుగుతున్న దృశ్యం, నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో అదనపు గదుల నిర్మాణం జరుగుతున్న దృశ్యం

## క్లుప్తంగా

### సహకార సంఘం అభివృద్ధికి కృషి



కృష్ణంరాజుకు ధ్రువ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: సహకార పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని కౌతాళం పరపతి సంఘం నూతన పర్సన్ ఇన్‌చార్జ్‌గా ప్రమాణస్వీకారం చేసిన దాట్ల కృష్ణంరాజు తెలిపారు. శుక్రవారం సంఘం పర్సన్ ఇన్‌చార్జిగా కృష్ణంరాజు, మెంబర్లుగా కామవరం గ్రామానికి చెందిన వీరసేన రెడ్డి, హాల్వి గ్రామానికి చెందిన బసవన్నగౌడుతో సంఘం సీఈఓ వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం పలువురు వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరేష్, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, బంటకుంట సర్పంచ్ గోపాల్‌రెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, డాక్టర్ అప్పులు, అమరేష్‌స్వామి, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, బాపురం గురునాథ్‌రెడ్డి,హాల్వి చెన్నప్పధని, రౌడూరు ధర్మ రెడ్డి, ఉప్పరహాల్ భీమన్నగౌడ్ పాల్గొన్నారు.

### ఎగ్జిబిషన్ ప్రవేశ రుసుము తగ్గించండి

ఆదోని రూరల్ : పట్టణంలో ఉన్న ఎగ్జిబిషన్ ప్రవేశ రుసుమును తగ్గించి, మంచినీటి సౌకర్యం కల్పించాలని డీవైఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం పట్టణ అధ్యక్షుడు వీరేష్, నాయకుడు మోహన్ మాట్లాడుతూ పట్టణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఎంట్రీ ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారని, దీంతో సామాన్యులు వినోదానికి దూరమవుతున్నారని చెప్పారు. స్పందించిన సబ్‌కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### నిర్మాణాలను వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని ఎమ్మిగనూరు, సూగూరు రహదారిలో ఉన్న జగనన్న కాలనీ లేఅవుట్‌లను డీపీఓ నాగరాజు నాయుడు శుక్రవారం సందర్శించారు. కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌లనుఆదేశించారు.అంతకు ముందు చిలకలడోణ, మంత్రాలయంలోని సచివాలయాలను తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ ప్రభావతి,హౌసింగ్ డీఈలాల్‌కృష్ణయ్య, ఈఓనాగరాజు,ఇంజినీర్లుశివ,భీమేష్ ఉన్నారు.

### 'బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం'

పెద్దకడబూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని అఖిలపక్ష నాయకులుతిక్కన్న, పరమేష్, వీరేష్ పిలుపునిచ్చారు.మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో శుక్రవారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, రాష్ట్రానికి విభజన హామీలు తీర్చకోవడంతో పాటు ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు దారాదత్తం చేయడం, నిరుద్యోగ సమస్యను పరిష్కరించకపోవడం, ధరలను అదుపు చేయలేకపోవడం వంటి చర్యలతో దేశాన్ని అధోగతి పాలు చేస్తున్నారని విమర్శించారు. నాయకులు హనుమంతు, శీను, నరసన్న, వీరేష్, నాగలక్ష్మి, రంగమ్మ, లక్ష్మి, త్రివేణి పాల్గొన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడు, మద్యంను చూపుతున్న సెబ్ పోలీసులు

మంత్రాలయం రూరల్: మండలంలోని చెట్నేహళ్లి గ్రామానికి చెందిన ఉరుకుందు 960 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సోమశేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం తనిఖీలు చేస్తుండగా మద్యం తరలిస్తుండటం గమనించి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టెబుల్ రబ్బానీ, గోపాల్, లింగప్రసాద్, చంద్రమౌళి కానిస్టేబుళ్లు రామచంద్రుడు, నరసింహారెడ్డి, రాధమ్మ ఉన్నారు.

### నీటి సౌకర్యం కల్పించండి

కోసిగి:స్థానిక సిద్దప్ప పాళెం కాలనీలో నివాసం ఉంటున్న రజకులకు ఏర్పాటు చేసిన దోబీ ఘాట్‌కు నీటి సౌకర్యం కల్పించాలని చేతివృత్తిదారుల మండల సమన్వయ కమిటీ నాయకులు వీరేష్, రాముడు, రజకవృత్తిదారుల సంఘం నాయకులు బసన్న , వీరేష్ కోరారు. శుక్రవారం కమిటీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నీటి సౌకర్యం లేక రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

## జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందాం

ఆదోని రూరల్ : నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, మరోసారి అవకాశం ఇచ్చి సీఎంగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కల్లుపోతుల సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండిగిరిలోని సీతారామాంజనేయనగర్, శాంతిమల్లప్పకొండ ప్రాంతాల్లో వారు ఇంటింటికీ తిరిగి మా నమ్మకం నువ్వే జగన్... జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు శ్రీధర్ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేష వీరేష్ పాల్గొన్నారు.

## రేపు బసవేశ్వర జయంతి

కోసిగి: మండల కేంద్రంలో వీరశైవలింగాయతీ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని సంఘం మండల నాయకులు జగదీష్ స్వామి, మహంతేష్ స్వామి,బెట్టనగౌడ, రాజమౌళి, బుక్కిటి వీరేష్, చిప్పిగి ఈరప్ప తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జయంతిని పురస్కరించుకుని బసవేశ్వర స్వామి శోభయాత్రను గ్రామ వీధుల్లో నిర్వహిస్తామని చెప్పారు. నాయకులు జీరు మల్లికార్జున, పూజారి గౌడ బ్రదర్స్ పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పనుల పరిశీలన

కౌతాళం: స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. శుక్రవారం పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేశారు. ఎన్టీఆర్ నగర్‌లోని ప్రధాన రహదారి నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉప సర్పంచ్ తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి పాల్గొన్నారు.

# పారదర్శకంగా పథకాల అమలు



వృద్ధులకు బుక్‌లెట్ అందజేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిలకలడోణ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులతో ఆరా తీశారు. అలాగే తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, కల్లుదేవకుంట సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, సర్మో వెంకటేష్, సర్పంచ్ నాగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఆకుల లక్ష్మి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకోవద్దు

- స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు
- పరిష్కారంలో నాణ్యత పెంచి.. రీ ఓపెన్ తగ్గించండి
- పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాల పంపిణీ త్వరగా పూర్తి చేయాలి
- ఆదోని సబ్ సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్




మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, సమీక్ష సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

ఆదోని రూరల్: స్పందన అర్జీల పరిష్కారంలో నాణ్యత పెంచి, రీ ఓపెన్ తగ్గించాలని, ప్రజలను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్పందన, రీ సర్వే, మ్యుటేషన్ కరెక్షన్, ట్రాన్సాక్షన్, స్టోన్ ప్లాంటేషన్, మీ సేవ సర్వీసెస్ తదితర రెవెన్యూ అంశాలపై డివిజన్‌లోని తహసీల్దార్, ఉప తహసీల్దార్, రీ సర్వే ఉప తహసీల్దార్‌లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. గడువు లోపు సమస్యలను పరిష్కరించాలని, ఒకవేళ సమస్య ఏ కారణంచేత అయినా పరిష్కరించడానికి వీలు లేకపోతే ఆ కారణాన్ని అర్జీదారుడికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. కారణం చెప్పకపోతే ప్రజలు మళ్లీ మళ్లీ అదే సమస్యతో కార్యాలయాలకు వస్తారని, ప్రస్తుతం స్పందనలో ఎక్కువశాతం రెవెన్యూ సమస్యలే ఉన్నాయన్నారు. ఇందులో 60, 70 శాతం రీ ఓపెన్ అవుతున్నాయంటే అధికారుల నిర్లక్ష్యం కూడా ఉందని అనుకోవాల్సి వస్తుందన్నారు. ఈ సంఖ్య పూర్తిగా తగ్గాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రీసర్వేకి సంబంధించిన భూహక్కు పత్రాల పంపిణీ 90 శాతం పూర్తి చేశారని, పెద్దకడబూరు, నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల్లో ఇంకా పెండింగ్‌లో ఎందుకు ఉందని సంబంధిత తహసీల్దార్‌లను ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాలను త్వరితగతిన పంపిణీ పూర్తి చేసి తనకు నివేదిక సమర్పించాలని వారిని ఆదేశించారు. మ్యుటేషన్ ఫర్ కరెక్షన్స్, ట్రాన్సాక్షన్‌కి సంబంధించి బియాండ్ ఎస్ఎల్ఏలో వీఆర్వో, తహసీల్దార్ లాగిన్‌లో చాలా ఉన్నాయని, గడువు లోపు వాటిని పూర్తి చేయకుండా ఎందుకు అలాగే పెట్టుకున్నారని నిలదీశారు. వీఆర్వోలు త్వరగా చేసేలా తహసీల్దార్లు పర్యవేక్షించాలని చెప్పారు. ఆదోని డివిజన్‌లో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ మే 15 నాటికి పూర్తి చేయాలన్నారు. ఒక రోవర్‌కి 120 స్టోన్ ప్లాంటేషన్ చేయాలని, కొన్ని చోట్ల వంద లోపల చేస్తున్నారని, తక్కువ చేస్తున్న వారితో సమీక్ష నిర్వహించి పురోగతి తీసుకురావాలన్నారు. మీ సేవ సర్వీసెస్‌కి సంబంధించి ఇన్‌కమ్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, బర్త్ అండ్ డెత్ వాటికి సంబంధించిన సర్వీసెస్ కూడా బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్నాయని, చిన్నచిన్న సర్వీసులు కూడా చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి సమయానికి పరిష్కారం చూపకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్ష సమావేశంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గులకరాయిపై మక్కా మదీనా చిత్రం




గులకరాయిపై మక్కా మదీనా చిత్రం డ్రాయింగ్ మాస్టర్ నారాయణపురం మల్లికార్జున , మక్కా మదీనా చిత్రం

ఆదోని రూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ మండలంలోని కమ్మరచేడు జెడ్పీ పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ నారాయణపురం మల్లికార్జున గులకరాయిపై మక్కా మదీనా చిత్రాన్ని తీర్చిదిద్దా రు. ఇంచు సైజులో గులకరాయిపై మక్కా మదీనా చిత్రాన్ని పెయింటింగ్‌తో సూక్ష్మ చిత్రాన్ని గీశారు.

## అమావాస్య ఆదాయం రూ.9.91లక్షలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయానికి అమావాస్య పూజలకు సంబంధించి రూ. 9.91 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. వారు శుక్రవారం మాట్లాడుతూ గురువారం జరిగిన అమావాస్యకు సంబంధించి దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.4,67,660, తలనీలాల టిక్కెట్ల ద్వారా రూ.18,375, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.3,18,400, రూముల బాడుగల ద్వారా రూ.21,400, ఖాళీ స్థలాల ద్వారా రూ.1,63,300, మొత్తం రూ.9,91,362 వచ్చిందని వివరించారు.

# అధికారులు నిబంధనల మేరకు పనిచేయాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం

ఆదోని రూరల్ : ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారులు పని చేయాలని ఆదోని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మండిగిరిలోనున్న రాజీవ్‌గాంధీ నగర్‌లో హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఇందులో భోజనంలో నాణ్యత లేదని, నీళ్ల సాంబారు వడ్డించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆకుకూరలు, ఇతర ప్రొటీన్ల మేరకు పిల్లలకు వండి వడ్డించాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం హైస్కూల్‌లో బోధనా పద్ధతులను పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశించిన ఇంగ్లిష్ మీడియాన్ని తప్పకుండా ప్రతిఒక్క విద్యార్థికి బోధించాలని సూచించారు. అనంతరం మండిగిరి సచివాలయం-01ను పరిశీలించి, హాజరుపట్టిక, సచివాలయ సిబ్బంది పనితీరు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సచివాలయాల్లో సిబ్బంది తీరు సరిగాలేదని, అధికారులు వారితో పని చేయించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ శివరాములు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు



ముస్లింలకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

కౌతాళం: రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ఉపవాస దీక్ష ఉన్న ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సర్పంచ్ పాల్‌దినకరన్, ఉప సర్పంచ్ సక్రి తిక్క య్య, వైస్ ఎంపీపీ రామలింగయ్యస్వామి, నాయకులు అబ్దుల్ సమద్, వెంకటరామరాజు, మాజీ సర్పంచ్ అవతారం, రాజ్‌అహ్మద్, ఉమాపతి, ఉరుకుంద ట్రస్టుబోర్డు డైరెక్టర్ మెంకోబ పాల్గొన్నారు.

# సినిమా స్క్రిప్టులా 'యువగళం'




పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తున్న యువగళం టీం సభ్యులు , దాడిలో గాయపడిన పెద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఆదోని అర్బన్: నారా లోకేష్ పాదయాత్ర సినిమా స్క్రిప్టును తలపిస్తోంది. స్క్రిప్టు వారిదే.. ప్రశ్న వారిదే.. సమాధానం కూడా వారిదే. కట్ చేస్తే యాక్షన్ మాత్రం నారా లోకేష్‌ది.ఎవరైనా సమస్యను అడిగేందుకు వచ్చినా, ప్రశ్నించేందుకు వచ్చినా.. యువగళం టీం సభ్యులు, టీడీపీ నాయకులు నారా లోకేష్ దగ్గరకు తీసుకెళ్లరు. ముందుగా ఎవరితో ప్రశ్న వేయించాలి, ఎవరితో సమస్య అడిగించాలో నిర్ణయించి తాము అందజేసిన స్క్రిప్టుతో ఎంపిక చేసిన వారిని లోకేష్ వద్దకు పంపుతున్నారు. అప్పటికే ఈ సమస్యలు, ప్రశ్నలపై లోకేష్‌కు తెలియజేసి యాక్షన్‌కు సిద్ధం చేస్తున్నారు. ఇదీ యువగళం తీరు. శుక్రవారం ఉదయం పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు సమీపం నుంచి యువగళం పాదయాత్ర ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటల నుంచి సిరుగుప్ప క్రాస్ రోడ్డు మీదుగా ఇస్వీ రోడ్డు కడితోట క్రాస్ వద్ద బహిరంగ సభలో ప్రసంగించి, అక్కడే బస చేశారు. పాదయాత్ర మొత్తం కేవలం తమకు అనుకూలమైన వారితో మాత్రమే ఆయనతో మాట్లాడించారు. ముఖాముఖి సభలోనూ ఇదే కథ నడిపించారు.

**వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన..**

కర్నూలులో హైకోర్టును అడ్డుకున్నందుకు ఈ ప్రాంతంలో పర్యటించడానికి వీల్లేదంటూ.. నారా లోకేష్ గో బ్యాక్ అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణంలోని కోట్ల కూడలి వద్ద ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. అయితే యువగళం టీం సభ్యులు, టీడీపీ నాయకులు వారిపై దాడికి యత్నించారు. వెంటనే డీఎస్పీ, పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సమయంలో పోలీసులతో టీడీపీ వర్గీయులు దురుసుగా వ్యవహరించారు. మున్సిపల్ పాఠశాల సమీపంలోని డివైడర్‌పై ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై ఒక్కసారిగా టీడీపీ నాయకులు, యువగళం టీం సభ్యులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



హొళగుంద సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుంటున్న గదగ్ పుట్టరాజు గవాయిలు పుణ్యాశ్రమం మఠం మఠాధీశులు కల్లయ్య అజ్జ

హొళగుంద: ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని కర్ణాటక రాష్ట్రం గదగ్ పుట్టరాజు గవాయిలు పుణ్యాశ్రమం మఠం మఠాధీశులు కల్లయ్య అజ్జ అన్నారు. మండల కేంద్రం సిద్ధేశ్వరస్వామి ఆవరణలో శుక్రవారం కల్బుర్గి శరణ బసవేశ్వరస్వామి పురాణ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కల్లయ్య అజ్జకు శుక్రవారం రాత్రి తులాభారం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారిని భక్తులు ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగ కల్లయ్య అజ్జ సిద్ధేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులు ఆయనకు తులాబారం నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారంతో పురాణ ప్రవచన కార్యక్రమం ముగిస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన హొళగుంద ఎస్‌ఐ

హొళగుంద: హొళగుంద ఎస్‌ఐగా వల్లెపు శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న అబ్దుల్ జహెర్‌ను వీఆర్‌కు పంపించి అనంతపురం జిల్లాలో పని చేస్తున్న శ్రీనివాసులును హొళగుందకు నియమించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## హస్త కళల అభివృద్ధికి కృషి



మంత్రి గుమ్మనూరుకు బుద్ధుడి ప్రతిమను అందజేస్తున్న విజయలక్ష్మి

ఆలూరు: హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. శుక్రవారం మంత్రిని ఆలూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏపీ హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి)చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి హస్త కళాకారులు తయారు చేసిన బుద్ధుడి ప్రతిమను మంత్రికి అదించారు.